మస్తు ఖుషీ

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్



నర్సింహులపేటలో పత్తిచేనుకు నీరు పెడుతున్న రైతు



- రాష్ట్రప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఆనందం
- జిల్లా వ్యాప్తంగా లక్షా 40 వేల మందికి లబ్ధి
- కర్షకులకు రూ.1,650 కోట్ల ప్రయోజనం
- 2023 డిసెంబర్ 9 లోపు వారికే వర్తింపు
- ప్రణాళికలు తయారు చేస్తున్న బ్యాంకు అధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 22 : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఖుషీ ఖబర్‌ను అందించింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తామని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో.. మహబూబాబాద్ జిల్లాలోని కర్షకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రుణాల మాఫీకి 2018 డిసెంబరు 12వ తతేదీ నుంచి 2023 డిసెంబరు 9వరకు 'కట్-ఆఫ్-డేట్'గా పేర్కొంది. రూ.2 లక్షలలోపు పంట రుణాలను ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన విధంగానే.. ఒకేసారి రూ.2 లక్షల లోపు రుణమాఫీని మాఫీచేస్తూ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకే విడతలో రూ.2 లక్షల మాఫీని శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంతో కాలంగా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులు బ్యాంకుల్లో ఉన్న తమ అప్పులు తీరుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.40 లక్షల మంది పంటరుణాలు తీసు కున్న రైతులకు రూ.1,650 కోట్ల రుణమాఫీ జరుగుతుందని లీడ్ బ్యాంక్ అధికారులు ప్రాథ మిక అంచనాలు వేశారు. బ్యాంకు అధికారులు ప్రణాళికలు తయారు చేయడంతో నిమగ్నమై ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇలా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు రూ.లక్ష వరకు విడతల వారీగా రుణమాఫీ చేయడం జరిగింది. అయితే సగం మంది రైతులకే రుణమాఫీ చేసి, మిగతా సగం మందిని గాలికి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఫేజ్-1 రూ.25 లోపు 7,890 మంది రైతులకు రూ.10.17 కోట్లు, ఫేజ్-2 రూ.25 వేల నుంచి 49,999 వరకు 9,421 మంది రైతులకు రూ.31.07 కోట్లు, ఫేజ్-3 రూ.50 వేల నుంచి రూ.99,999 వరకు 28,988 మంది రైతులకు రూ.191.21 కోట్లను మాఫీ చేసింది. ఫేజ్-4 రూ.50 వేలపై నుంచి రూ.99,999 వరకు 14,203 మంది రైతులకు 112.60 కోట్లు వెరసి జిల్లాలో 60,502 మంది రైతులకు రూ345.10 కోట్లు రుణమాఫీ అయింది. కాగా, 1,17,634 మంది రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీకి అర్హులు కాగా, అందులో 60,502 మందికి రుణమాఫీ జరుగగా.. ఇంకా 50,716 మంది రైతులు మిగిలిపోయారు.

ఒకేసారి రుణమాఫీ..

తెలంగాణ రాష్ట్రంలో ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గత ఎన్నికల ముందు రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించారు.

దాంతో సీఎం ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకాన్ని తీసుకుని రుణమాఫీ చేశారు. ఈ రుణమాఫీకి 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. ఈ మధ్య కాలంలో రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ జరుగనుంది.

జిల్లాలో 1.40 లక్షల మందికి లబ్ధి..

మహబూబాబాద్ జిల్లాలో 1.40 లక్షల మందికి రూ.1,650 కోట్లు లబ్ధి జరుగనుందని బ్యాంకు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. రైతులందరికీ రుణ విముక్తి లభించనుంది. ఒకేసారి ఈ రుణమాఫీ చేయడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

తొందరగా మాఫీ చేయాలి..

- గుగులోతు శ్రీరాం, రైతు, రత్తిరాంతండా, నెల్లికుదురు



వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవడానికి రెండేళ్ల కింద రూ.2 లక్షల రుణాన్ని నెల్లికుదురు బ్యాంకు నుంచి తీసుకున్నాను. తీసుకున్న రుణం కట్టలేక ఇబ్బందులు పడుతున్న సమయం లో కాంగ్రెస్‌ప్రభుత్వం రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది. తొందరగా రుణమాఫీ చేయాలి.

రుణమాఫీ నిర్ణయం పట్ల హర్షం..

- గౌని భద్రయ్య, రైతు, మద్దివంచ, గార్ల.



వ్యవసాయ పెట్టుబడుల కోసం సొసైటీ నుంచి రూ.70 వేలు పంట రుణం తీసుకున్నాను. ఇప్పటి వరకు రూ.7 వేల వరకు వడ్డీ కట్టాను. మిగతావి కడదామని అనుకున్న సమయంలోనే రుణమాఫీ జరిగింది. రుణమాఫీ చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

రూ.లక్ష వరకు పంట రుణం ఉంది..

- కాసాని భిక్షం, కేసముద్రం విలేజ



కేసముద్రంలోని జాతీయ బ్యాంకులో రూ.60వేల పంట రుణం తీసుకున్నా, వడ్డీతో కలిపి రూ.లక్ష వరకు అయింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం అభినందనీయం. గత ప్రభుత్వం లాగా కాకుండా ఒకేసారి రుణమాఫీ చేయడం సాహసోపేతమైన నిర్ణయం. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేయడం ద్వారా రైతులకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

- విద్యా వైద్య రంగానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట
- ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి
- గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క





జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క, చిత్రంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అధికారులు

మహబూబాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం అన్నిశాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేపట్టి లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలని సూచించారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేదలకు నాణ్యమైన విద్య అందేలా కాంగ్రెస్ సర్కార్ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలో మత్తుపదార్థాల ద్వారా జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గురుకులాలు, ఏకలవ్య, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. నకిలీ విత్తనాలపై దృష్టి సారించి జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టి ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు వేలాడే కరెంట్ తీగలను సరిచేసి మరణాలను నివారించాలని, నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఉక్కుపాదం మోపాలని మంత్రి సీతక్క సూచించారు. చిన్నపిల్లలపై ఆఘాయిత్యాలను నిర్మూలించాలని ఆ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కల్వర్టు నిర్మాణ పనులకు ఆటంకం కలుగకుండా అటవీశాఖ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మహిళా క్యాంటిన్‌లను ప్రారంభించడానికి అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు..

- ఎంపీ బలరాంనాయక్

గ్రామాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా, వైద్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు ఏ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయాధికారులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా చూడాలనిమంత్రిని కోరారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీల్లో ఉన్న పండ్ల మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేసే పనులు గ్రామ అవసరాలకు అనుగుణంగా ఉండేలా చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు.

విద్యారంగం పట్ల ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

జిల్లాలో విద్యారంగం పట్ల ప్రత్యేక దృష్టి సారించి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులతో కూడిన విద్యాబోధన, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించిందని చెప్పారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయిరాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఎఫ్‌వో విశాల్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జడ్పీ సీఈవో నర్మద, పంచాయతీరాజ్ ఎస్‌ఈ సురేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాలుగు గంటల పాటు సమీక్ష..

మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్క సుమారు నాలుగు గంటల పాటు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా మానుకోటకు విచ్చేసిన మంత్రి సీతక్కను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన సమీక్ష సమావేశం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. శాఖల వారీగా సమీక్ష చేపడుతూ అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

జిల్లా పోలీస్ అధికారులకు రాష్ట్రస్థాయి పతకాలు



దేవేందర్ టౌన్ సీఐ | వరప్రసాద్ ఎస్బీ సీఐ | ఆర్.సదయ్య హెడ్ కానిస్టేబుల్

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు పోలీస్ అధికారులకు రాష్ట్రస్థాయి పతకాలకు ఎంపికయ్యారు. పోలీస్‌శాఖలో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, ఆగస్టు 15, గణతంత్ర దినోత్సవం జనవరి 26న రాష్ట్రస్థాయి పతకాలను అందజేస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఆగస్టు 15న ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, ఉద్యోగులకు పతకాలను అందించేందుకు 460 మందిని ఎంపిక చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీజితేందర్ శనివారం ప్రకటించారు. అందులో మహబూబాబాద్ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న పెండ్యాల దేవేందర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్న పి.బాలాజీవరప్రసాద్, డీఏఆర్‌విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎ.వెంకన్నరాష్ట్రస్థాయిసేవా పతకాలకు ఎంపికయ్యారు. మహబూబాబాద్ డీఏఆర్ విభాగంలో పని చేస్తున్న ఏఆర్ఎస్సై జి.వీరారెడ్డి, కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆర్.సదయ్య ఉత్తమ సేవాపతకాలకు ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ పతకాలను అందుకోనున్నారు.

ఏకశిల స్కూల్లో పుస్తకాల గది సీజ్



ఏకశిల పాఠశాల పుస్తకాల గదిని సీజ్ చేసిన విద్యాశాఖాధికారులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 22 : మానుకోట పట్టణంలోని ఏకశిల పాఠశాల పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు మండల విద్యాధికారి పూల్‌చంద్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు శనివారం ఏకశిల పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో పాఠశాలకు వెళ్లి పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ఇదే రోజు ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక పాఠశాలలో పుస్తకాలు, టై, బెల్టులు, యూనిఫాం విక్రయిస్తుండగా పుస్తకాల గదికి వెళ్లి అందులో కూర్చొని ఆందోళన చేపట్టి సమాచారాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి, సెక్టోరియల్ అధికారులకు అందజేశారు. డీఈవో రామారావు ఆదేశాల మేరకు పాఠశాలకు వెళ్లి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశామని ఎంఈవో పూల్‌చంద్ తెలిపారు.

రుణమాఫీతో 78,432 రైతులకు లబ్ధి
- డీసీసీ బ్యాంకు పరిధిలో రూ.529.44 కోట్ల మాఫీ
- రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచే ముఖ్యమంత్రి
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు
8

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

డోర్నకల్, జూన్ 22 : అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగులమందు ఆత్మహత్య చేసుకున్న ఘటన ముల్కలపల్లిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. ముల్కలపల్లికి చెందిన ఇమ్మడబోయిన శ్రీనివాస్ (50) కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం కూలీ పనులకు వెళ్లి వస్తుండగా, రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బతగిలింది. ఆ దెబ్బఎంతకు మానకపోవడంతో వైద్యం కోసం భారీగానే ఖర్చు చేశాడు. అయినా గాయం మానలేదు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ ఊరు బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అక్కడ్నుంచి ఇంటికి వచ్చిన తర్వాత అతనివద్ద పురుగులమందు వాసన వస్తుండడంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య వీరమ్మ, కుమారుడు సాయిరామ్, తల్లి ముత్తమ్మ ఉన్నారు. కుమారుడు సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ రావు తెలిపారు.



మర్రిమిట్ట బీట్‌లోని నరికివేసిన చెట్లను పరిశీలిస్తున్న రేంజ్ అధికారి సురేష్

అటవీ భూమిలో చెట్ల నరికివేత

- పరిశీలించిన రేంజ్ అధికారి సురేష్

గూడూరు, జూన్ 22 : గూడూరు అటవీశాఖ రేంజ్‌పరిధిలోని నర్సంపేట- గూడూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న మర్రిమిట్ట సెక్షన్, మర్రిమిట్ట బీట్ కంపార్ట్‌మెంట్ నెంబర్ 1037లో అటవీ భూముల్లో శనివారం గుర్తు వ్యక్తులు చెట్లను నరికి వేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెట్ల నరికి వేతను సీరియస్‌గా తీసుకుంది. తాజాగా నర్సంపేట-గూడూరు జాతీయ రహదారి భూపతిపేట సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న అటవీభూముల్లో వేప, ఇతర జాతుల చెట్లను నరికి వేశారు. ఈ విషయం తెలుసుకున్న గూడూరు రేంజ్ అధికారి సురేష్, సెక్షన్ అధికారి జగ్గయ్య, బీట్ అధికారి కవిత, బేస్‌క్యాంప్ సిబ్బంది నరికివేసిన చెట్లను పరిశీలించారు. ఈ విషయంపై రేంజ్ అధికారి వివరణ కోరగా.. పోడు కోసమే అటవీభూమిలో చెట్లను నరికి వేసి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. అడవుల అభివృద్ధి కోసం అటవీశాఖ నిరంత రాయంగా కృషి చేస్తుందన్నారు.

అడవిలో చెట్ల నరికివేత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. చెట్ల నరికి వేతపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో చెట్ల నరికివేతకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులు బృందాలుగా చదువుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

డోర్నకల్, జూన్ 22 : ఒకే తరగతి చదువుతున్న విద్యార్థులు బృందాలుగా ఏర్పడి చదువుకోవాలని, అలా చదువుకున్నప్పుడు వచ్చే సందేహాలను ఒకరినొకరు నివృత్తి చేసుకోవచ్చని డీఈవో రామారావు అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులలో కొంతమందికి కొన్నిసబ్జెక్టులు ఇష్టంగా ఉంటాయని, కొందరికి కఠినంగా ఉంటాయని చెప్పారు. అలాంటి విద్యార్థులు చదువులో వచ్చే సందేహాలను ఒకరినొకరు నివృత్తి చేసుకోవడం ద్వారా ఆయా సబ్జెక్టులపై అవగాహన ఉంటుందన్నారు. జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి బాలరాజు, నీతి అయోగ్ ప్రత్యేక అధికారి శ్రీనాథ్, సతీష్, విత్తనాల సుధాకర్ ఉన్నారు.



డోర్నకల్ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రామారావు

రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్


హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హనుమకొండ టౌన్, జూన్ 22: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సూచించారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో హుస్సేన్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించి, ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులపై ఉన్న 20 డీసీ కేసులపై సమీక్ష జరిపి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ మోహన్‌రావు, అశోక్, సదర్‌లాల్, గిరిజన విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలునాయక్, అజ్మీర శ్రీరామ్‌నాయక్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బి.రాజశేఖర్, కేబీ రాజేందర్, స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్టీ కేసులపై సమీక్ష

వరంగల్ క్రైం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చారు. అదనపు డీసీపీ రవి కమిషన్ సభ్యుడికి స్వాగతం పలికారు. అనంతరం కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ పెండింగ్ కేసుల వివరాలు, బాధితులకు అందించాల్సిన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని హుస్సేన్ నాయక్ సూచించారు.

మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 22: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రతిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. రెండు నెలల కిందట మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ప్రజాప్రతినిధి డ్యాన్స్ చేసిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సందర్భంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ చేయడంతో పాటు ఎస్సై ప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి కేసులో రెండు రోజుల కిందట కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ అరెస్టు డిస్మస్ అయ్యాడు. ఈరెండు ఘటనలు రెండునెలల వ్యవధిలో ఒకే సర్కిల్ పరిధిలో చోటు చేసుకోవడంతో పర్యవేక్షణ అధికారిగా ఉన్న మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావుపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సమర్థంగా విధులు నిర్వర్తించే అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఉద్దేశంతో సీఐ రాజేశ్వరరారవును బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆయన స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించకపోవడంతో పోస్టింగ్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో కాళేశ్వరం, మహదేవపూర్ పీఎస్‌లలో ఎస్సైలుగా పనిచేసి సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన అధికారులు.. మళ్లీ మహదేవపూర్ సర్కిల్‌లోనే పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీరితో మరో ఇద్దరు ఇదే సర్కిల్‌లో పోస్టింగ్ కోసం స్థానిక రాజకీయ నాయకుల సహకారంతో ఉప ముఖ్యమంత్రి వద్ద పైరవీ చేస్తున్నట్లు సమాచారం.



విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ వరంగల్ జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదటి రోజు మొత్తం 480 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కాగా, వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులను కౌన్సెలింగ్ సెంటర్‌లో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ శాలువాతో సత్కరించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు అన్ని విధాలా సహకారాలు అందిస్తున్న తల్లిదండ్రులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న శ్రద్ధకు గౌరవంగా తాము ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

డొల్ల కంపెనీల పేరిట మోసం

● జాబ్ గ్యారంటీ పేరిట వసూళ్లు ● డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని దగా ● దిక్కుతోచని స్థితిలో బాధితులు

వరంగల్ క్రైం, జూన్ 22: డొల్ల కంపెనీలు పెట్టి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. లేని కంపెనీలు ఉన్నట్లు పేపర్ల మీద సృష్టించి లక్షలు దండుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు ఓ ప్రబుద్ధుడు. సదరు మాయలోడు చేసిన మోసంతో పలువురు నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. అతడు చెప్పిన మాయమాటలు నమ్మిన బాధితులు లక్షలు పోగొట్టుకుని ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఒక వ్యక్తి.. 2017లో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించాడు. ఈ క్రమంలో 2020లో ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ప్రారంభించి వరంగల్ నగరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభించాడు. స్థానికుల సహకారంతో మడికొండ ఐటీ సెక్టార్‌లో కొంత ప్రభుత్వ స్థలం తీసుకున్నాడు. జాబ్ గ్యారంటీ పేరిట ట్రెయినింగ్ ప్రారంభించి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షలకు పైగా వసూలు చేశాడు. ఇలా.. దాదాపు 100 మంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. ట్రెయినింగ్ పూర్తి అయిన తర్వాత నిరుద్యోగులు ఉద్యోగాలపై నిలదీస్తే తప్పించుకుతిరిగాడు. దీంతో కంపెనీ నిర్వాహకుడిని విద్యార్థులు నిలదీశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కళాశాల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో నిర్వాహకుడిని ప్రశ్నించారు. కేసు పెడుతామని హెచ్చరించడంతో చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కంపెనీలన్నీ పేపర్లమీదనే ఉన్నట్లు గ్రహించిన బాధితులు.. మోసపోయినట్లు గ్రహించి నిర్వాహకుడి కోసం వెతికినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. అయితే హైదరాబాద్‌లో వెతికిపట్టుకున్న కొందరు విద్యార్థులను బెదిరించినట్లు సమాచారం. డబ్బులు పోగొట్టుకున్న బాధితులు వారి పేరు చెప్పేందుకు సైతం జంకుతున్నారంటే నిర్వాహకుడు ఏ స్థాయిలో బెదిరింపులకు గురిచేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.



భాగస్వామ్యం ఇస్తానని మోసం

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు ట్రెయినింగ్‌ల పేరిట నిరుద్యోగులను మోసం చేయడంతోపాటు డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. పొరుగు దేశంలో ఉన్న స్నేహితుడి వద్ద రూ.25లక్షలు తీసుకున్న సదరు కంపెనీ నిర్వాహకుడు.. మరొకరిని ఇండియాకు పిలిపించి మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇండియాకు వచ్చిన మరో బాధితుడి నుంచి రూ.15లక్షలు తీసుకుని డైరెక్టర్ చేస్తానని మోసం చేయడంతో పాటు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని బాధితుడు తెలిపాడు. బాధితుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పొరుగు దేశంలో ఉన్న బాధితుడు హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు తన కుమారుడికి ఎథిరాం కంపెనీలో డైరెక్టర్ అవకాశం ఇస్తానంటే రూ.1కోటి వరకు నిర్వాహకుడికి ఇచ్చాడు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ఉద్యోగి తెలిపాడు. ఇలాగే మరో ముగ్గురి వద్ద రూ.15లక్షల చొప్పున తీసుకుని సంవత్సరంలో కోటి ఇస్తానని, నెలనెల రూ.1లక్ష వేతనం ఇస్తానని మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. తన వద్ద పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనాలు ఇచ్చేవాడు కాదనే విమర్శలున్నాయి. సదరు నిర్వాహకుడిపై బాధితులు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, జిల్లా జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

జాబ్ గ్యారంటీ అని మోసం చేశాడు..

ఎన్.రాహుల్, బాధితుడు



జాబ్ గ్యారంటీ అంటే శిక్షణ కోసం రూ.1లక్ష 50వేల చెల్లించాను. శిక్షణ కూడా ఏమి ఇవ్వలేదు. శిక్షణ కోసం లెక్చరర్స్ కూడా లేరు. మమ్మల్ని యూట్యూబ్‌లో చూసుకుని నేర్చుకోండి అనేవాడు. తొమ్మిది మాసాలు జాబ్ వస్తుందనే ఆశతో టీచింగ్ లేని శిక్షణలో పాల్గొన్నాం. తీరా జాబ్ గురించి ప్రశ్నించే సమయంలో బోర్డు తిప్పేసి వెళ్లాడు. డబ్బులు వసూలు చేసుకునేందుకు ప్రయత్నించాం. ఫలితం లేకుండా పోయింది. జాబ్ కోసం వచ్చి డబ్బులు పోగొట్టుకున్నాం. అతడి జాడ కోసం వెతుకుతున్నాను.

కంటెంట్ తీసుకుని మోసం చేశాడు..

కె.సంతోష్, బాధితుడు



మోసపూరిత మాటలు చెప్పి నేను తయారు చేసిన ఒక సంస్థకు సంబంధించిన కంటెంట్ తీసుకున్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ తీసుకున్నాడు. నా సర్వీసు తీసుకుని మోసం చేశాడు. అతడి వల్ల రూ.15లక్షలకు పైగా నష్టపోయా. డబ్బులు అడిగితే అనుచరుడితో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. లీగల్ నోటీసు ఇచ్చినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అతడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి..

ఆర్.సంతోష్‌కుమార్, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి స్థలం కేటాయించాం. కిందటేడు భవనం పూర్తి చేయాల్సి ఉండగా, గడువు కోరితే మరో సంవత్సరం ఇచ్చాం. ఈ యేడు నెలాఖరులోగా పూర్తి చేయకుంటే నోటీసు ఇచ్చి కేటాయించిన స్థలం రద్దు చేస్తాం. సంస్థ నిర్వాహకుడిపై ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి. నిర్వాహకుడుకి డబ్బులు ఇచ్చామని, భాగస్వామ్యం ఇస్తానని ఇవ్వలేదని, జాబ్ ఇస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు వచ్చాయి. అవి ప్రైవేటు ఫిర్యాదులు.. మా పరిధిలోవి కావు. కొంతమంది కంపెనీ వివరాలు ఆర్టీఏ కింద కోరితే అందించాం. నిబంధనలు విస్మరిస్తే సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ పోల్ ఎక్కే పరీక్షకు 12 మంది హాజరు

హనుమకొండ టౌన్, జూన్22: జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నియామకాల్లో భాగంగా శనివారం హనుమకొండ ములుగురోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)లో 7వ సారి నిర్వహించిన విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 16 మందికిగాను 12 మంది హాజరైనట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. డైరెక్టర్ మోహన్‌రావు, వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, టెక్నికల్ డీఈ ఆనందం, ఎన్‌పీటీఐ డీఈ రాజేందర్ పర్యవేక్షణలో వీడియోగ్రఫీ మధ్య పరీక్ష ముగిసింది. కాగా, కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను హనుమకొండ ఎస్ఈ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

మానుకోటలో యువకుడి ఆదృశ్యం



పొడకంటి రంజిత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం భవానినగర్‌లో ఈ నెల 10వ తేదీన పొడకంటి రంజిత్ అనే యువకుడు అదృశ్యమయ్యాడని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌కు చెందిన పొడకంటి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెను మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించగా ఈ నెల 10న ఆమె గుండెజబ్బుతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్న కొడుకు పొడకంటి రంజిత్‌ను తీసుకుని కుటుంబసభ్యులు మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం కిరాణషాపుకు వెళ్లి వస్తానని చెప్పిన రంజిత్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వారు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడా అచూకీ లభించకపోవడంతో ఈ నెల 11న తండ్రి వెంకటేశ్వర్లు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ దేవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ నిబంధనలు పాటించిన కళాశాలలకే గుర్తింపు

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి

వర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూన్ 22: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో యూజీసీ నిబంధనల మేరకు నడుచుకునే కళాశాలలకే వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తామని, నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి స్పష్టంచేశారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం కేయూ సెనెట్ హాల్‌లో జరిగింది. కేయూ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ బలోపేతం అయినప్పుడే వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలను అకస్మికంగా తనిఖీలు చేస్తామని చెప్పారు. కొత్త కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, సేవలను అందించాలని సూచించారు. బోధన, శిక్షణ, పరిశోధనపై దృష్టి సారించాలని కోరారు. వర్సిటీ ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను పరిశోధన కేంద్రాలుగా అనుమతులు ఇచ్చామన్నారు. ఆటానమస్ పొందిన కళాశాలల పరీక్షల ఫలితాలను ఆడిట్ చేస్తామని వెల్లడించారు. అనేక సమస్యలున్నప్పటికీ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను సరైన సమయంలో విడుదల చేస్తున్నామని, పేర్కొన్నారు. ప్రభుత్వ అధ్యాపకులు పేపర్ వాల్యూవేషన్‌కు రావాలని కోరారు. వర్సిటీ కింద 297 కళాశాలుండగా, 197 కళాశాల బోధన సిబ్బందిని వర్సిటీ పోర్టల్‌లో నమోదు చేశారని వివరించారు.

డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు మాట్లాడుతూ.. జూన్ 10 నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. జూలై 1 నుంచి దోస్త్ మేరకు 1వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కళాశాలలు వర్సిటీ ఫీజులు చెల్లించాలని, అధ్యాపకుల రాటిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వర్సిటీ ఆదేశాల మేరకు రికార్డులన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ల్యాబ్ చేయించాలని చెప్పారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి మాట్లాడుతూ.. పరీక్షల నిబంధనలు పాటించాలని, అంతర్గత పరీక్షల, ప్రయోగ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మాల్‌ప్రాక్టీస్ కేసుల వివరాలను ఎప్పుటికప్పుడు ప్రిన్సిపాళ్లు పరీక్షల విభాగానికి తెలియజేయాలని చెప్పారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పరీక్షల ప్రమోషన్, మాల్‌ప్రాక్టీస్, చాలెంజ్ వాల్యూవేషన్, వాల్యూవేషన్‌తో పాటు బకెట్ సిస్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పరీక్షల విభాగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్లను మైభారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. వర్సిటీ పరిధిలో 356 యూనిట్లు సక్రమంగా బ్యాంకు అకౌంట్లను నిర్వహిస్తున్నాయని, మిగతా 77 సక్రమంగా పనిచేయాలని చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు స్పోర్ట్స్ ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ క్రీడల్లో పాల్గొనడం లేదని అన్నారు. 297 కళాశాలల్లో కేవలం 10/15 కళాశాల విద్యార్థులే స్పోర్ట్స్‌లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్మానాక్ మేరకు కళాశాలలు క్రీడలు నిర్వహించాలని, క్రీడా అధ్యాపకులను నియమించాలని అన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ పలు సందేహాలను వర్సిటీ అధికారులకు విన్నవించారు. ప్రధానంగా 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించాలని, అతిథి అధ్యాపకుల ఉత్తర్వులు సక్రమంగా ఇవ్వాలని, అల్మానాక్‌లో గ్యాప్ లేకుండా చూడాలని కోరారు. పరీక్షల విభాగం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని కోరారు. పరీక్షల విభాగంలో హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీకి, కాలేజీయేట్ కమిషనరేట్ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. కేయూ అకడమిక్ విభాగం ఏఆర్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమైన 15 రోజుల్లో రీఅడ్మిషన్ పొందాలని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేయగా, ఏఆర్‌లు హబీబుద్దీన్, ఆర్‌వీ, తొర్రూరు, పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బొలగాని రాములు, డాక్టర్ కొప్పుల మల్లేశం, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- సొంతభవనాలు లేక, కిరాయి ఇళ్లల్లోనే కొనసాగింపు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరుకున్న సెంటర్లు
- నెల్లికుదురు మండలంలో ఇబ్బంది పడుతున్న పిల్లలు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు


రామన్నగూడెంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం


నెల్లికుదురులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నెల్లికుదురు, జూన్ 22 : అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసి.. మాతాశిశు ఆరోగ్య పరిరక్షణ, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంకల్పం నీరుగారి పోతోంది. అంగన్‌వాడీ భవనాలు నిర్మించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు అధిక నిధులు కేటాయించి నిర్మించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. గతంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూపిన ఉత్సాహం.. ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు.

నెల్లికుదురులో మాత్రమే మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సకల సౌకర్యాలు కల్పించారు. మిగత గ్రామాల్లోని మోడల్ అంగన్ వాడీకేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి, నేటికి వాటిని పట్టించుకోవడంలో విఫలమవుతున్నాయి. ఆయా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాచికల్ గ్రామం లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నప్పటికి భవనాలు లేకపోవడంతో అద్దెభవనాలలో కొనసాగిస్తున్నారు. ఏటా మండలంలో నూతనంగా అదనపు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నప్పటికి పక్కా భవనాలు మౌళిక సౌకర్యాలు కల్పించకపోవడంతో గర్భిణీలు, పిల్లలు కేంద్రాలకు ఆసక్తి చూపడం లేదు. అంగన్‌వాడీ భవనాలు లేకపోవడంతో 15 ఏళ్లగా అద్దెభవనాలలో కొనసాగుతున్నాయి.

మండల వ్యాప్తంగా 120 కేంద్రాలు..

నెల్లికుదుర మండల వ్యాప్తంగా 120 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా రామన్నగూడెం, జామతండా, బ్రాహ్మణకొత్తపల్లి, ఎర్రబెల్లిగూడెం, నర్సింహులగూడెం, నైనాల, రాజులకొత్తపల్లి గ్రామాలలో మాత్రమే పక్కాభవనాలు ఉన్నాయి. మిగతా చోట్ల అద్దెభవనాలలో అరకొర వసుతుల మధ్య కొనసాగుతున్నాయి. రామన్నగూడెంలో అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థకుకు చేరడంతో అద్దె భవనాలలో కొనసాగిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం, గుడ్లు, పాలు బియ్యం, పప్పులను నిల్వచేయలేకపోతున్నారు. అద్దె భవనాలకు కిరాయి సకాలంలో చెల్లించక పోవడంతో ఖాళీ చేయాలని ఇంటి యజమానులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న టీచర్ ఆయా పోస్టులు భర్తీ చేయకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడే దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

పిల్లర్లకే పరిమితమైన భవననిర్మాణ పనులు...

నెల్లికుదురు ఎస్సీకాలనీ, చిన్ననాగారంలో అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో రత్తిరాంతండాలో పిల్లర్లు వేసి వదిలేశారు. పిల్లర్లుకు ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు తుప్పుపట్టి పోతున్నాయి. నెల్లికుదురులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాలలో కొనసాగుతున్నాయి. కాచికల్‌లో మూడు, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాలలో కొనసాగుతున్నాయి, బంజర గ్రామంలో పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంలో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. భవనాలు పూర్తిగా నిర్మించకపోవడంతో అరకొర వసుతుల మధ్య కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికి అంగన్‌వాడీ కేంద్రాలలో మౌళిక సౌకర్యాలు కల్పించడం లేదని గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించి పిల్లకు గర్భిణీలకు బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ప్రజలు కోరుచున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి..

ఇసంపెల్లి సైదులు, సీఐటీయూ మండల కార్యదర్శి



అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అరకొర వసుతుల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాలు నిర్మించి, మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలు కేంద్రానికి వచ్చే విధంగా ఆకర్షనీయంగా తీర్చిదిద్దాలి.

25, 29న హకీంపేట స్పోర్ట్స్ స్కూలులో ప్రవేశాలకు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 22 : హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలుంటాయని జిల్లా యువజన క్రీడల అధికారి బి.అనిల్‌కుమార్, ఎంఈవో పూల్‌చంద్ శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 25న మానుకోట మండలస్థాయి, 29న జిల్లా స్థాయిలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరం 4వ తరగతిలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు 1 సెప్టెంబరు, 2015 నుంచి 31 ఆగస్టు, 2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు జనన ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఆధార్‌కార్డు, 5 పాస్‌ఫొటోలతో పాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 81063 43229, 99851 85257, 99512 34114లను సంప్రదించాలన్నారు.

తెలంగాణ క్రీడా సాధికార సంస్థ స్పోర్ట్స్ స్కూల్లో..

తొర్రూరు : తెలంగాణ క్రీడా సాధికార సంస్థ స్పోర్ట్స్ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2015-16 మధ్య జన్మించిన బాల బాలికలకు 4వ తరగతి స్పోర్ట్స్ పాఠశాల ఎంపిక నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో ఎంపికైన బాల బాలికలకు జూన్ 29వ తేదీ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎంపికలు ఉంటాయన్నారు. అక్కడ అర్హత సాధించిన వారు జూలై 29న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల విద్యార్థులు 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ 5 ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం కోసం పోరాడాలి

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : దేశంలో 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు సమగ్ర వేతన చట్టం కోసం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయడం ఎంతో అవసరమని చెప్పారు. గ్రామీణా ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది వ్యవసాయ కూలీలు పనులు దొరకక పొట్ట చేత పట్టుకుని పనుల కోసం పట్టణాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. వలస కార్మికులకు ఎలాంటి హక్కులు అనుభవించకుండా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. వారికి రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బండపల్లి వెంకటేశ్వర్లు, ముంజంపల్లి వీరన్న, ఉమగాని సత్యం, రాములు, ఆలకుంట్ల కొమురయ్య పాల్గొన్నారు.

ఎన్డీ పెద్ద చంద్రన్న వర్గంలో చేరికలు

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న వర్గంలో పెద్ద సంఖ్యలో చేరినట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బొక్కల భాస్కర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఎన్డీ పార్టీ ఆదివాసీ, పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల కోసం భూ పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్యనగర్, కన్నన్న నగర్ కాలనీ వాసులు సుమారు 80 కుటుంబాలు చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదార్, ప్రతాప్‌రెడ్డి, ఉపేంద్రాచారి, సట్ల యాకయ్య, ఐలయ్య, సాయిలు, సతీష్, బాల్యమంగ్య, జ్యోతి, అనిల్,స్వప్న, జయమ్మ, వీరన్న, పాపన్న పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : టీఎన్జీవోస్


మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందిస్తున్న టీఎన్జీవోస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 22 : ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి , స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కకు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. వెంకటేశ్వరర్లు, రాజ్యలక్ష్మి, యాకూబ్, బాస్కర్, సోమానీ పాల్గొన్నారు.

- విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని ఎస్ఎస్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న కోరారు. మంత్రి సీతక్క వినతి పత్రాన్ని అందించారు. రమేష్, రాజశ్రీ, హసినా, భిక్షపతి పాల్గొన్నారు.

సరిహద్దు తండాలో యువతి అదృశ్యం


తేజావత్ శైలజ

గార్ల, జూన్ 22 : మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సరిహద్దు తండాకు చెందిన తేజావత్ శైలజ అనే యువతి ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే రోజు రాత్రి పొద్దుపోయే వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇండ్లలో వాకబు చేశారు. యువతి ఆచూకీ లభ్యకాకపోవడంతో పోలీస్‌స్టేషన్ యువతి తల్లి తేజావత్ గంగా ఫిర్యాదు చేశారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

'రుణమాఫీతో 78,432 రైతులకు లబ్ధి'


సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం ద్వారా వరంగల్ ఉమ్మడి జిల్లాలో డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రుణమాఫీ, లబ్ధిపొందే రైతుల వివరాలను తెలియచేశారు. డీసీసీ పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ద్వారా గొప్ప ఆర్థిక ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా రుణమాఫీ కలిగే రైతుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందచేసినట్లు చెప్పారు. ఈ విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించినట్లు చెప్పారు. రుణమాఫీ, రైతుల వివరాల గురించి సందేహాలు ఉన్నట్లైతే రైతు, సహకార సంఘాలు తమ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

డీసీసీ బ్యాంకు, సహకార సంఘాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు తీసుకున్న రైతుల్లో 7లక్షల75వేల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనుందని చెప్పారు. రూ.5048.01 కోట్ల రుణమాఫీ జరుగనుందని వివరించారు. కేవలం డీసీసీ బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాల పొందిన రైతుల రుణాల మాఫీయే ఇంత పెద్ద మొత్తంలో ఉంటే.. ఇక వాణిజ్య ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రైతులు భారీ మొత్తంలో ఉంటుందన్నారు. ఇంతటి వ్యయభారాన్ని సైతం లెక్క చేయకుండా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి ముఖ్యమంత్రిగా చిర స్థాయిలో నిలిచిపోతారని కొనియాడారు. గత ప్రభుత్వం దశల వారిగా రుణమాఫీ నిర్ణయాలు ప్రకటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేతమైనదిగా అభివర్ణించారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులే వారికి గుణపాఠం చెప్పనున్నారని రవీందర్‌రావు పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ హరిప్రసాద్, డైరెక్టర్లు నర్సింగారావు, నరేందర్, మురళీధర్, రవితేజ, జగన్మోహన్, యాదగిరిరెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వాజిర్ సుల్తాన్, సీపీవోలు రోహిణి, దమయంతి, కురువనాయక్, రాజశేఖర్, నవీన్, కల్యాణి, రాధిక, అశోక్, మధుసుదన్, స్రవంతి, కృష్ణమోహన్, రాజు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసే నిర్ణయాన్ని తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీ బ్యాంకు డెరెక్టర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది.

'వేములవాడ బస్సు సర్వీసు ప్రారంభించాలి'

కేసముద్రం, జూన్ 22 : కేసముద్రం మండలం కాట్రపల్లి మీదుగా గతంలో ఉన్న వేములవాడ ఆర్టీసీ బస్సు సర్వీసును మళ్లీ ప్రారంభించాలని ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఆ గ్రామ ఎంపీటీసీ గుగులోత్ సునితదస్రూనాయక్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లందు నుంచి మహబూబాబాద్, కేసముద్రం, కాట్రపల్లి, వరంగల్ మీదుగా వేములవాడకు ఉదయం 5.30కు బస్సు సర్వీసు ఆరు నెలల పాటు నడిపి రద్దు చేసినట్లు చెప్పారు. ఈ బస్సు సర్వీసు అయా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందని, మళ్లీ ప్రారంభించాలని కోరారు.

భౌతికశాస్త్రంలో వేణుగోపాల్‌కు డాక్టరేట్



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 22 : మానుకోటలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడుఆర్.వేణుగోపాల్ డాక్టరేట్ (పీహెచ్‌డి) పట్టాను అందుకున్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల డాక్టరేట్ పట్టాను అందుకున్న వేణుగోపాల్‌ను స్థానిక నూకల రాంచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ చింతకుంట్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో పాలీవినైల్ ఆల్కహాల్ మ్యాట్రిక్స్ ఆధారిత నానోకంపోసైట్ల తయారీ, లక్షణీకరణ పై 2017 నుంచి పరిశోధనలు పూర్తి చేశాడు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మహేష్‌గౌడ్

దంతాలపల్లి, జూన్ 22 : కేంద్రానికి చెందిన జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం తాను లిఖిత పూర్వకంగా నివేదికను ఇచ్చానన్నారు. ఈ సందర్భంగా మంత్రి సానుకులంగా స్పందించారన్నారు. జిల్లాలో బీజేపీ పుంజుకుందన్నారు. కేంద్ర మంత్రుల ఆధ్వర్యంలో రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడ పూర్ణచందర్‌రెడ్డి, యుగేంధర్, శ్రీను తదితరులు ఉన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు

కేసముద్రం, జూన్ 22 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియామకమైన బండి సంజయ్‌ను కరీంనగర్‌లో శనివారం కేసముద్రం బీజేపీ మండల అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫంక్షన్‌హాల్‌కు రూ.లక్ష విరాళం

కేసముద్రం, జూన్ 22 : కేసముద్రంలో నిర్మిస్తున్న మున్నూరుకాపు సంఘానికి చెందిన ఎంకే కన్వెన్షన్ హాల్‌కు సంఘం జిల్లా గౌరవ సలహాదారులు ఘనపురపు అంజయ్య రూ. లక్ష విరాళాన్ని అందజేసినట్లు సంఘం మండల అధ్యక్షుడు చందా గోపి తెలిపారు. ఈ మేరకు ఆయన పుట్టినరోజు సందర్భంగా మహబూబాబాద్‌లో శనివారం ఆయన్ను కలిసి సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. గతంలో ప్రకటించిన విరాళాన్ని ఈ సందర్భంగా సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, సింగంశెట్టి ఏకాంతం, రావుల మురళి, పిన్ని రాము పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 22 : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మహాగొప్పదని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఫారెస్టు సెంటర్‌లో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జన్మదినోత్సవం రోజున అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్యచే జన్మదిన కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌడవరపు మోహన్‌రావు, చుక్కల ఉదయ్‌చందర్, నిమ్మల శ్రీను, ఎడ్ల రమేష్, రాంశెట్టి వీరేందర్, పింద్రాల రాందాసు, బండారు చిరంజీవి, రామరాజు ఉపేందర్, గాంధీ, వీరన్న పాల్గొన్నారు.

ఆందోళనలో గణేష్ బాధితులు

బయ్యారం, జూన్ 22 : పలువురిని నమ్మించి సుమారు రూ.10 కోట్లతో ఉడాయించిన బయ్యారానికి చెందిన కిరాణ వ్యాపారి గణేష్‌కు చెందిన పలువురు బాధితులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. బాధితులు తెలిపిన ప్రకారం. గణేష్ కొంతకాలంగా పలువురితో సాన్నిహిత్యంగా మెలుగుతూ మంచితనాన్ని ఆసరాగా చేసుకొని, తన మాయమాటలతో నమ్మించి మోసం చేసి దాదాపు 150 మంది వద్ద రూ.10 కోట్ల మేర వడ్డీల రూపంలో డబ్బులు తీసుకున్నాడు. ఇటీవలె ఎవరికి చెప్పాచేయకుండా గణేష్ తన కుటుంబంతో సహా గ్రామం నుంచి ఉడాయించడంతో అతనికి డబ్బులు ఇచ్చిన పలువురు బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తమకు న్యాయం చేయాలంటూ గణేష్ బాధితులు పలువురు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.

సైబర్‌క్రైం పట్ల విద్యార్థినులకు అవగాహన

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : సైబర్‌క్రైం పట్ల విద్యార్థినులు అప్రమత్తంగాఉండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. మహబూబాబాద్‌జిల్లాకేంద్రం శివారు అనంతారం సమీపంలోని ఫార్మసి కళాశాలలో శనివారం విద్యార్థినులకు సైబర్‌క్రైం, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. చట్టల పట్ల విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై దీపికరెడ్డి, ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు రాందాస్, సోములు, అశోక్ పాల్గొన్నారు.

24న మండలస్థాయి క్రీడోత్సవాలు


నెల్లికుదురు, జూన్ 22 : తెలంగాణ క్రీడాప్రాధీకార సంస్థ హైదారాబాద్ వారి ఆదేశాల మేరకు ఈనెల 24న మండలస్థాయి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గుగులోత్ రాము తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ 2024- 25కు గాను హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతి ప్రవేశాల కొరకు మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 29న మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడలలో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన 20మంది బాలురు, 20మంది బాలికలను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

వీరభద్రుడి సన్నిధిలో రాష్ట్ర సమాచారశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక పూజలు


దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జగన్

కురవి, జూన్ 22 : శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో రాష్ట్ర సమాచార శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎస్.జగన్ శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. కుటుంబ సమేతంగా వీరభద్ర స్వామి ఆలయానికి వచ్చిన డీఎస్.జగన్‌కు అర్చకులు సాదరస్వాగతం పలికారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్న జగన్ కోరిన కోరికలు తీర్చే వీరభద్రస్వామిని దర్శించుకోవడం తన ఆదృష్టమన్నారు.

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమనేత వెంకన్న మృతి


వెంకన్న (ఫైల్)

బయ్యారం, జూన్ 22 : మండలకేంద్రానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, జేఏసీ నేత గోపగాని వెంకన్న (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వెంకన్న తొలుత కొంతకాలం విప్లవపార్టీలో పని చేశారు. అనంతరం టీఆర్ఎస్ ఆవిర్భావ సమయంలో ఆ పార్టీలో చేరిన ఆయన ఉద్యమ సమయంలో చురుకైన పాత్రపోషించారు. మండల జేఏసీ కమిటీ సభ్యునిగా కొనసాగిన వెంకన్న ఉద్యమంలో పలుమార్లు అరెస్టు అయ్యాడు. ఈ క్రమంలో కొంత అనారోగానికి గురైన ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నాడు. కొంతకాలం క్రితం గుండెకు సంబంధించిన వ్యాధికి గురైన వెంకన్న శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు శ్రీను, కూతురు సుచిత్ర ఉన్నారు. వెంకన్న మృతిపట్ల తెలంగాణ ఉద్యమకారులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

- మంత్రి సీతక్కకు ప్రధానోపాధ్యాయుల వినతి

కొత్తగూడ, జూన్ 22 : గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదీలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు మంత్రి సీతక్కకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుల సర్వీస్ రూల్స్ కల్పిస్తు, 10, 12 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. ఈమేరకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గాంగునాయక్, ఈసం సురేందర్‌రావు, సక్రు, సాయిబాబా, బాబు, రాజమ్మ, నర్సయ్య, యాకలక్ష్మి, పద్మ, రామలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (పజాపంథా) నేత ప్రభాకర్

గంగారం, జూన్ 22 : గంగారం, కొత్తగూడ మండలాలలో మొక్కజొన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ విక్రయించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)గంగారం, కొత్తగూడ మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గంగారం మండలం పందెం గ్రామంలో శనివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజన్సీ ప్రాంత మండలాలైన గంగారం కొత్తగూడ మండలాలలో రైతుల ప్రధాన పంటైన మొక్కజొన్న సాగుకు అనుకూలమైన ఎంకే 30 రకం విత్తనాలను కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్ కి తరలించి అధిక ధరలకు విక్రయించటంపై ఆయన మండి పడ్డారు. రైతులకు కావలసిన విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత స్థానిక వ్యవసాయశాఖ అధికారులదేనని అన్నారు. ఎంకే 30 రకంవిత్తనాల కొరతపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోగరామయ్య, నరసయ్య, లక్ష్మయ్య, నరేందర్, సదానందచారి, జమిలి, కిష్టయ్య, వెంకటయ్య తదితరలు పాల్గొన్నారు.

నీట్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

గార్ల, జూన్22 : దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్‌పరీక్ష లీకేజీపై తక్షణమే బీజేపీ ప్రభుత్వం స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భీముడు, జంపాల వెంకన్న, భట్టు వీరన్న, బిక్షమయ్య, భీమ్లా పాల్గొన్నారు.


గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

గంగారం, జూన్ 22 : ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు శనివారం పుట్టలభూపతి తండాలో గంగారం ఎస్ఐ రవికుమార్ నేతృత్వంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 120 లీటర్ల బెల్లం పానం ధ్వంసం చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేదించిన గుడుంబాను తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో గుడుంబా తయారు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు, జూన్ 22 : చక్కతండాకు చెందిన మల్లానాయక్ ఇటీవల కాలంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి పదో తరగతి స్నేహితులు మల్లానాయక్ కుటుంబానికి శనివారం రూ.85, 409ల ఆర్థిక సాయం అందించారు. మల్లానాయక్ కుటుంబా ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులు కొంత నగదును జమ చేశారు. చక్కతండాకు చెరుకుని మృతుడు మల్లానాయక్ భార్యకు నగదును అందజేశారు. భూక్య మంగీలాల్, చీర కుమా, భూక్య దేవా, తేజావత్ చందర్, గుగులోతు సుందర్, తేజావత్ కోట్య, బానోత్ వనిత, సంపత్, సాంబయ్య, వీరన్న, బిక్షపతి, నల్లగొండ అనిల్, ఇస్లావత్ భోజ్య, అశోక్, సురేష్, ఈశ్వర్, సునీత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


వెంకన్న (ఫైల్)

నెల్లికుదురు, జూన్22 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన రాజులకొత్తపలిలో శనివారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం. లింగాలవెంకన్న (59) తన వ్యవసాయబావి విద్యుత్ మోటార్ తీగలను సరిచేస్తున్న క్రమంలో తీగలు మీద పడటంతో విద్యుదాఘాతంలో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య యాదమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది లీటర్ల గుడుంబా ధ్వంసం

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మండలంలోని అయోధ్య గ్రామశివారు భజనతండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన గుడుంబాను స్వాధీనం చేసుకుని బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన భూక్య బబ్లూ ఇంట్లో గుడుంబా కాస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 30 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా అదృశ్యంపై కేసు నమోదు


జ్యోతి (ఫైల్)

దంతాలపల్లి, జూన్22 : మండలంలోని గున్నేపల్లికి చెందిన ఓ మహిళా అదృశ్యంపై శనివారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగుడురుకు చెందిన ముద్దరబోయిన ప్రభాకర్-జ్యోతి దంపతులు గత మూడేళ్లుగా గున్నేపల్లిలో నివాసం ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో జ్యోతి (30) ఈనెల 17న ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిందన్నారు. భర్త ప్రభాకర్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈదంపతులకు ఇద్దరు కుమారులున్నారు.

బంజరలో యువతి..

- డోర్నకల్ : ఇంటి నుంచి బయటకు వెళ్లిన 19 ఏళ్ల యువతి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తహసీల్దార్ బంజరకు చెందిన యువతి ఈనెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో శనివారంపోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నర్సింహులపేటలో భారీ వర్షం

- జలమయమైన వారాంతపు సంత


అంబేద్కర్ సెంటర్లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

నర్సింహులపేట, జూన్ 22 : మండల కేంద్రంతో పాటు బొజ్జన్నపేట, కొమ్ములవంచ, కౌసల్యదేవుపల్లి, ముంగిమడుగు, పడమటిగూడెం గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. నర్సింహులపేటలో వారాంతపు సంత కావడంతో చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసి విక్రయదారులకు అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో కారు మబ్బులు కమ్మి ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో అంబేడ్కర్ సెంటర్ జలమయమై చిరు వ్యాపారుల సరుకులు తడిసి ముద్దయి ఒక్కో వ్యాపారికి వేలలో నష్టం వాటిల్లిందని బాధిత వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర గ్రామాల్లో పత్తి రైతులు విత్తనాలు విత్తి వారం రోజులు గడుస్తున్నా చినుకు కనికరించకపోవడంతో శనివారం భారీ వర్షం రావడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు.